PRGI NO: TGTEL/25/A2356

# మేకార్తి దినపత్రిక

శనివారం 11-07-2026 | పేజీలు : 6 | వెల రు : 4/- | సంపుటి : 1 సంచిక : 309 | WWW.MEKARTHI DINAPATRIKA.COM

జర్నలిస్టులకు ఆహ్వానం
నూతనంగా ప్రారంభించిన
మేకార్తి దినపత్రిక పత్రికలో
అన్ని జిల్లాలలో స్టాఫర్లుగా,మండలాల్లో విలేకర్లుగా పనిచేయుటకు
జర్నలిస్టులు కావలెను
సంప్రదించాల్సిన నెంబర్స్
9014726022,6302041083

# 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్స్ ఆర్థిక వ్యవస్థ



- దేశ ఆర్థిక వ్యవస్థలో 10శాతం వాటా సాధించేలా ప్రణాళికలు
- తెలంగాణను అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ఓఆర్ఆర్ లోపలున్న పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలింపు

**హైదరాబాద్‌ను కాలుష్యం నుంచి తప్పించే చర్యలు ఇండియాస్ నెక్ట్స్- జెన్ సోలార్ మాడ్యూల్ యూనిట్ ప్రారంభంలో సీఎం రేవంత్**

హైదరాబాద్,జూలై9: 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్స్ ఆర్థిక వ్యవస్థగా ఎదుగు తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. షాబాద్ మండలం సీతారాంపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియాస్ నెక్ట్స్- జెన్ సోలార్ మాడ్యూల్ యూనిట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. యువతలో నైపుణ్యాభివృద్ధి కోసమే.. స్కిల్స్ యూనివర్సిటీ నెలకొల్పాం. ఏటా 1.10 లక్షల మంది యువత ఇంజినీరింగ్ పట్టాలతో బయటకి వస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పరిశ్రమలు రావాలి. బ్లూకాలర్ ఎంప్లాయిస్‌లో కొత్త స్కిల్స్ పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. సీతారాంపురం ప్రజల త్యాగాల వల్లే ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటయ్యాయని తెలిపారు.

వివరాలు 2 లో..






## మనది నాగరికత బంధం రెండు దేశాల ప్రజల్ని అది కలుపుతోంది: మోదీ

- ప్రంబనన్ దేవాలయం వద్ద ప్రధాని మోదీ, ఆ దేశాధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో

యోగ్యాకార్టా: సాంస్కృతిక, నాగరికత పరమైన బంధాలు భారత్-ఇండోనేసియాలను కలుపుతున్నాయని భారత ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఇండోనేసియా పర్యటనలో భాగంగా అధ్యక్షుడు సుబియాంతోతో కలిసి యోగ్యాకార్టాలో ఉన్న 10వ శతాబ్ద కాలం నాటి అతిపెద్ద హిందూ ఆలయం- ప్రంబనన్‌ను బుధవారం ఆయన సందర్శించారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ- భారతదేశం మాదిరిగానే ఇక్కడి గాలిలోనూ సాంస్కృతిక పరిమళాలు ఉంటాయని విన్నానని, ఈ సాంస్కృతిక వారసత్వం ఇరు దేశాలను ఒక్కటి చేస్తోందని మోదీ చెప్పారు. దాదాపు 1,200 ఏళ్లపాటు ఆలయాన్ని కాపాడుతూ వచ్చినందుకు ఇండోనేసియా ప్రజలకు, పాలకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడకు రాగానే మహా మృత్యుంజయ మంత్రం, ఓం నమఃశివాయ అనే మంత్రం వినిపించడం హృదయాన్ని హత్తుకుందన్నారు. ఇరువురు దేశాధినేతలు కలిసి ప్రంబనన్ ఆలయ పునరుద్ధరణ ప్రాజెక్టును ప్రారంభించారు. ఇండోనేసియా పర్యటన ముగించుకున్న మోదీ ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ చేరుకున్నారు. మిత్రబంధాన్ని మరోసారి చాటుకుంటూ ఆయనకు వీడ్కోలు ఇచ్చేందుకు ఇండోనేసియా అధ్యక్షుడు కూడా జకార్తా విమానాశ్రయానికి వచ్చారు.

## కళాకారుల ఆరోగ్యం, సంక్షేమం కూడా ముఖ్యమే



- కళాకారులతో మాట్లాడినప్పుడు వారి ఆరోగ్య సమస్యలు గుర్తించా
- అందుకే వారి ఆరోగ్యం కోసం ఉచిత వైద్య చికిత్స ఏర్పాటు చేశా
- ఎక్స్ వేదికగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడి

అమరావతి,జూలై9: సంప్రదాయ కళలను పరిరక్షించడం అంటే వాటిని ప్రోత్సహించడం మాత్రమే కాదని, వాటిని జీవనాధారంగా చేసుకున్న కళాకారుల ఆరోగ్యం, సంక్షేమాన్ని కాపాడటం కూడా ప్రభుత్వ బాధ్యత అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళా మహోత్సవం సందర్భంగా హస్తకళాకారులు, చేనేత కార్మికులతో మాట్లాడిన సమయంలో వారు ఎదుర్కొంటున్న వృత్తి సంబంధిత ఆరోగ్య సమస్యలు తన దృష్టికి వచ్చాయని ఆయన పేర్కొన్నారు. ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. హస్తకళా మహోత్సవం సందర్భంగా హస్తకళాకారులు, చేనేత కార్మికులతో ఆత్మీయంగా మమేకమయ్యే అవకాశం లభించిందన్నారు.

పేజి 2లో ▶

## 22ఏ సంకెళ్లు తెంచిన ప్రజాప్రభుత్వం: చంద్రబాబు

- వేలాది ఎకరాల భూములకు నిషేధిత జాబితా నుండి విముక్తి

గుటుపల్లి గ్రామానికి చెందిన 897 మంది రైతులకు ఊరట

- తహసీల్దార్ కార్యాలయంలోనే ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి
- గత ప్రభుత్వ తప్పిదాలను సరిచేస్తూ రెవెన్యూ ప్రక్షాళన
- దశాబ్దాల పెండింగ్ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం



2లో

## హరీష్ రావుపై కెసిఆర్‌కు నమ్మకం లేదు

- అందుకే మంత్రి పదవికి దూరం పెట్టారు
- ఎల్‌నినోపై కార్యాచరణ చేపడతున్నాం
- సచివాలయంలో మీడియాతో మంత్రి ఉత్తమ్



2లో

## తాడిచర్ల-2 బొగ్గు గని..

**తెలంగాణకు భరోసా: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**



2లో

# వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నాం

**రెండున్నరేళ్లలోనే 35వేల కోట్లు రైతులకు అందచేత**

- రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నాం
- బిఆర్ఎస్ పాలనలో క్రాప్ డ్యామేజ్‌కు కెసిఆర్ ఒక్క పైసా ఇవ్వలేదు
- ఖమ్మం పర్యటనలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క



ఖమ్మం,జూలై9: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. రైతాంగానికి అవసరమైన సహాయ సహకారాలు అన్ని విధాలుగా అందిస్తున్నామని పేర్కొన్నారు. గురువారం ఖమ్మం జిల్లా చింతకాని మండలం లచ్చగూడెంలో డిప్యూటీ సీఎం పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. చింతకాని మండలం జగన్నాథపురం మత్కేపల్లి క్రాస్ రోడ్డులో రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతు ఆశీర్వాద సభకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేబినెట్ మంత్రులు అందరినీ ఆహ్వానించామని పేర్కొన్నారు. పదేళ్ల పాటు పాలించిన బీఆర్ఎస్ రైతు భరోసాకు రూ.75 వేల కోట్లు ఖర్చు చేసిందని మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాకు కేవలం రెండున్నరేళ్లలో రూ.35 వేల కోట్లను రైతులకు అందజేసిందని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో క్రాప్ డ్యామేజ్‌కి ఒక్క రూపాయి కూడా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో రైతుల కోసం పని చేస్తోందని స్పష్టం చేశారు. రైతుభరోసా కింద కేవలం తొమ్మిది రోజుల్లో ఎనిమిది ఎకరాల చొప్పున పూర్తిస్థాయిలో అందరికీ రూ.8759 కోట్లు ఇచ్చామని వెల్లడించారు. రైతు ఆశీర్వాద సభలో మరో రూ.1900 కోట్లు రైతు భరోసాకు తొమ్మిది ఎకరాల నుంచి యాభై ఎకరాల వరకూ విడుదల చేయనున్నామని తెలిపారు. అన్నదాతలు రైతు ఆశీర్వాద సభకు పెద్ద సంఖ్యలో తరలి రావాలని మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

వివరాలు 2 లో..



## వైసీపీ ఒక మూతపడే దుకాణం: పీతల సుజాత

- జగన్ ట్రాప్‌లో దళితులు పడొద్దు
- అసత్య ప్రచారాలతో ప్రజలను మభ్యపెడుతున్నారు
- చట్టాలను అవహేళన చేస్తే గుదిబండలు అవుతాయి
- కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి శ్రమిస్తోంది
- అరాచకాలు సృష్టిస్తే ఉపా చట్టం ప్రయోగిస్తాం

2లో

## సింగరేణిలో మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలి



20 నుంచి గోదావరిఖనిలో నిరాహార దీక్షకు కవిత నిర్ణయం

2లో

# సంపాదకీయం

## ప్రతిపక్షాలకు ప్రజాస్వామ్య పాఠాలు

న్యాయవిరుద్ధంగా జరుగుతోన్న ప్రజాస్వామిక ఎన్నికలను ఎందుకు బహిష్కరించకూడదు? ఈ ప్రశ్న గుసగుసలుగా వినిపిస్తోంది. దీనిపై బహిరంగ చర్చ జరగాలి. ఆ చర్చ 'ఎన్నికలతో ఎందుకు ఇబ్బంది పడాలి?' అన్న ప్రశ్నతో ఆరంభమవ్వాలి. తులనాత్మక రాజకీయాలపై మౌలిక కృషికి ప్రసిద్ధుడైన పోలిష్-- అమెరికన్ రాజనీతి శాస్త్రవేత్త ఆడమ్ ప్రెవోర్స్కీ ప్రజాస్వామిక ఎన్నికలను గట్టిగా సమర్థించారు. ప్రజాస్వామ్యానికి ఆయన ఇచ్చిన నిర్వచనం సుప్రసిద్ధమయింది. 'ఎన్నికల ద్వారా ప్రభుత్వాలను ఎన్నుకోవడానికి, తొలగించడానికి వీలుండే ఒక వ్యవస్థ' అని ప్రజాస్వామ్యాన్ని ఆయన నిర్వచించారు. సుపరిపాలన, న్యాయబద్ధమైన ప్రజా ప్రాతినిధ్యం, సామాజిక సామరస్యం ప్రజాస్వామ్యంతోనే సమకూరుతాయని మనం స్వతస్సిద్ధంగా విశ్వసిస్తాం. అయితే పోటీదాయక ఎన్నికలు ఈ గుణాత్మక పరిస్థితులకు దోహదం చేయకపోవచ్చని ప్రెవోర్స్కీ అంటారు. అయినప్పటికీ ఓటర్లను, నాయకులను, రాజకీయ పార్టీలను చికాకుపరిచే, ఇబ్బంది పెట్టే ప్రజాస్వామిక ఎన్నికలు విధిగా జరగాలని, అనేకానేక విభజనలు, అసమానతలతో సతమతమవుతున్న సమాజాలు అంతర్యుద్ధం దురవస్థల పాలవకుండా సామరస్య పూర్వకంగా మనుగడ సాధించేందుకు అవి విశేషంగా తోడ్పడుతాయని ఆయన నొక్కి చెప్పారు. అధికారంలో ఉన్నవారు పదవీ వైభవాన్ని కోల్పోయేందుకు అంగీకరిస్తారు, ఎన్నికలలో ఓడిపోయినవారు పరాజయాన్ని ఆమోదిస్తారు, అధికార మార్పిడి ఎన్నికల ద్వారా శాంతియుతంగా జరగడమే అందుకు కారణమని ప్రెవోర్స్కీ అన్నారు. 1977 చరిత్రాత్మక లోక్‌సభ ఎన్నికలలో సంభవించిన మార్పే అందుకు నిదర్శనం.

ఎన్నికల సమగ్రత (ఎలక్టోరల్ ఇంటిగ్రిటీ) ఒక పరిమితికి మించి పతనం కానప్పుడే అధికార బదిలీ శాంతియుతంగా జరిగేందుకు ఆస్కారమున్నది. అయితే ఎన్నికల సమగ్రతను నిష్పాక్షికంగా నిర్ణయించే ప్రమాణాలు ఏమిటి? ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన 11 అంశాలపై పిప్పానోరిస్, రిచర్డ్ ఫ్రాంక్ ఫెర్రాన్ మార్టినెజ్ కోమా అనే రాజనీతి శాస్త్రవేత్తల విశ్లేషణ ఎన్నికల సమగ్రతను నిర్ధారించేందుకు తోడ్పడుతుంది. వాటిలో ఒకటి ప్రచార నిధులు. ఈ అంశం మన ఎన్నికలను ఎంతగా ప్రభావితం చేస్తుందో మరి చెప్పనవసరం లేదు. నిధుల లభ్యత విషయంలో పాలక ప్రతిపక్షాల మధ్య అసమానతలు ఎన్నికల సమగ్రతకు చేటు చేస్తున్నాయి. 2014 అనంతరం మరో మూడు అంశాల-- తటస్థ ఎన్నికల అధికారులు, పారదర్శక ఎన్నికల నిర్వహణ పద్ధతులు, మీడియా కవరేజ్-- లో మన ఎన్నికల సమగ్రత క్రమంగా ఆమోదయోగ్య స్థాయి నుంచి బాగా దిగజారిపోతోంది. ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ, డీలిమిటేషన్‌తో పాటు ప్రతిపక్షాలను నిలువునా చీల్చివేయడం మొదలైన చర్యలతో మన ఎన్నికల సమగ్రత మరింతగా భ్రష్టమవుతోంది. కోట్లాది వయోజనులకు ఓటు హక్కును నిరాకరించడం, పాలకపక్షం ప్రయోజనాలకు అనుగుణంగా నియోజకవర్గాల సరిహద్దులను మార్చివేయడం ఎన్నికల సమగ్రతకు ఎలా తోడ్పడుతాయి?

భారత ప్రజాస్వామ్య ఎన్నికలు ఒకప్పుడు ఈ పురానవ భూమికి గర్వకారణంగా ఉండేవి. ఇరుగుపొరుగు దేశాలకు అసూయ పుట్టించేవి. సుదూర ప్రజాస్వామిక దేశాలకు అబ్బురం కలిగించేవి. అదంతా పాతకథ. ఇప్పుడు మన ఎన్నికల సమగ్రత కనీస ఆమోదయోగ్య స్థాయి నుంచి బాగా కిందకు జారిపోయింది. నిక్కచ్చిగా చెప్పాలంటే అధికారపక్షం తాను ఎన్నికలలో గెలిచితీరాలనుకుంటే గెలిచి తీరుతుంది. అలా గెలిచేందుకు అవసరమైన పరిస్థితులను సృష్టించుకోగలదు. ఈ కారణంగానే ప్రతిపక్ష నాయకులు మనుగడ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. తుది ఫలితం ముందుగానే నిర్ణయించబడిన ప్రజాస్వామిక పోటీలో వారు పాల్గొని తీరవల్సిందేనా? ఇదొక మంచి ప్రశ్న. ప్రజాస్వామిక పోటీ నుంచి పూర్తిగా ఉపసంహరించుకోవడం, పూర్తిస్థాయిలో ఎన్నికలను బహిష్కరించడం ఆ ప్రశ్నకు సరైన సమాధానం కాదు, కాబోదు. అటువంటి ప్రతిపాదనను మన ప్రతిపక్షాలు తిరస్కరించాలి. అందుకు మూడు సహేతుకమైన కారణాలు ఉన్నాయి.

మొదటిది ఒక నైతిక వాదన. పాలకపక్షం మోసపూరితంగా ఫలితాలను తనకు అనుకూలంగా మార్చుకుంటున్నప్పటికీ ప్రతి ఎన్నికలలోనూ పోటీ చేసి తీరాలన్న సరళమైన ప్రజాస్వామిక తర్కంకాదిది. ఎన్నికల ప్రచార నైతికతకు ప్రాధాన్యమిచ్చే వాదన అది. పార్టీల పరస్పర విమర్శలు వాస్తవాల ఆధారంగా ఉండడం, వ్యక్తిగత దూషణలకు పాల్పడకపోవడం, సమాజంలో శాంతి సామరస్యాలను కాపాడడం మొదలైనవి ఎన్నికల ప్రచారంలో విధిగా అనుసరించాల్సిన కనీస నియమాలు. ప్రజాస్వామిక నిబద్ధత ఆ నైతిక పద్ధతులను అనుసరించాల్సిన ఆవశ్యకతను నిర్దేశిస్తుంది. ఎన్నికల ఫలితాలను తారుమారు చేస్తున్నారని ప్రతిపక్షాలు విశ్వసిస్తుంటే ఆ వాస్తవాన్ని ప్రజలూ పూర్తిగా నమ్మేలా చేయడం వాటి విధ్యుక్త ధర్మం. గత సార్వత్రిక ఎన్నికలలోను, ఆ తరువాత వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలోను 'ఓట్ చోరీ' జరిగిందని కాంగ్రెస్ పార్టీ నెత్తి నోరు కొట్టుకుని ఆందోళన చేస్తోంది. కాంగ్రెస్ వాదనలపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. అంతమాత్రాన సామాన్య ఓటర్లు ఆ 'ఓట్ చోరీ' అభియోగాన్ని ఆమోదిస్తున్నారనే నిర్ణయానికి రావడం తొందరపాటే అవుతుంది. ఎటూ పాలకులకే అనుకూలంగా వ్యవహరించే జన మాధ్యమాల తీరుతెన్నుల మూలంగా ఎన్నికలలో చోటు చేసుకుంటున్న అక్రమాలపై ప్రజల అవగాహన అరకొరగా మాత్రమే ఉంటోంది. ఈ పరిస్థితి నిరుత్సాహం కలిగిస్తున్నప్పటికీ ఓటర్లు స్వయంగా ఎన్నికల్లో నిష్పాక్షికత, పారదర్శకతను డిమాండ్ చేసే పరిణత స్థాయికి ప్రజాభిప్రాయాన్ని నిర్మించడం ప్రతిపక్షాల బాధ్యత. విపక్షాలకు ప్రజాస్వామిక నైతికత నిర్దేశిస్తున్న కర్తవ్యమది.

రెండో వాదన వ్యూహాత్మకమైనది.. ఎన్నికల నిర్వహణ తీరుతెన్నులు న్యాయవిరుద్ధంగా ఉన్నప్పటికీ ఆ ప్రజాస్వామిక ప్రక్రియలో పాల్గొనడమే వివేకవంతమవుతుంది. ఎన్నికలను బహిష్కరించడం బాధ్యతాయుతమైన చర్య కాబోదు. ప్రపంచ దేశాల అనుభవం ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ఎన్నికల బహిష్కరణ అనేది పోలింగ్‌లో పాల్గొనే ఓటర్ల సంఖ్యను అత్యధిక స్థాయిలో తగ్గించి తీరాలి. లేని పక్షంలో నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా ఉద్దేశించిన బహిష్కరణ వ్యూహం నిష్ఫలమవుతుంది. అంతేకాదు, ప్రజలు తమను ఆమోదించరనే భయ సంకోచాలతోనే ప్రతిపక్షాలు ఎన్నికలలో పాల్గొనడం లేదని పాలకులు ఆరోపించేందుకు ఆ వ్యర్థ వ్యూహం ఆస్కారమిస్తుంది. చెప్పవచ్చినదేమిటంటే ఎన్నికలలో పాల్గొనడమనేది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు అనేక అవకాశాలను కల్పిస్తుంది. విపక్షాలు ఎట్టి పరిస్థితులలోను వాటిని జారవిడుచుకోకూడదు. తమ పాలన చట్టబద్ధమైనదని ప్రపంచానికి చెప్పుకోవడానికై నిరంకుశ పాలకులు ప్రతిపక్షాల పట్ల ఔదార్యం చూపడం కద్దు.

## తాడిచర్ల-2 బొగ్గు గని..

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: తెలంగాణ బిడ్డగా తాడిచర్ల-2 బొగ్గు గని కోసం తాను కృషి చేస్తే అభినందించాల్సింది పోయి విమర్శలు చేస్తున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆ విమర్శలను సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విజ్ఞతకే వదిలేస్తున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో సింగరేణి కార్మికులకు రూ.30వేల కోట్ల బకాయిలు పెట్టారని.. ఆ పార్టీకి తనను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు.

"రాష్ట్రానికి బొగ్గు బ్లాక్ తేవడం తప్పా?బీఆర్ఎస్ హయాంలో రెండు కోల్ బ్లాక్స్‌ను ప్రైవేటు వాళ్లకు అప్పగించారు. బొగ్గు గని వేలం పాటను మోదీ తీసుకురాలేదు.. సుప్రీంకోర్టు తెచ్చింది. సింగరేణికి తాడిచర్ల-2 బ్లాక్‌ను కేంద్రం కేటాయించింది. ఇటీవల కాలంలో సింగరేణి బొగ్గులో నాణ్యతా లోపముంది. మంచి గనులు లేకపోవడం వల్ల నాణ్యమైన బొగ్గు లభించడం లేదు. సింగరేణికి చేయూత అందించాలని మోదీని అనేకసార్లు కలిసి కోరాను. సింగరేణికి 45 ఏళ్లపాటు తాడిచర్ల-2 అందుబాటులో ఉంటుంది. ఇది తెలంగాణకు భరోసా. అత్యంత నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి కానుంది. భవిష్యత్తులో విద్యుత్ సమస్యలు రాకూడదని ఈ గని కేటాయించారు. రాజకీయాలకు అతీతంగా సింగరేణి కార్మికులకు అండగా ఉండాలి" అని కిషన్‌రెడ్డి అన్నారు.

## హరీష్ రావుపై కెసిఆర్‌కు నమ్మకం లేదు

మొదటిపేజీ తరువాయి

ఇరిగేషన్‌లో హరీశ్‌రావు నిష్ణాతుడైతే వాళ్ల మామ కేసీఆర్ ఆయనను మంత్రి పదవి నుంచి మొదట్లో ఎందుకు తొలగించారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. హరీశ్‌రావుపై కేసీఆర్‌కు నమ్మకం లేకనే మంత్రి పదవి నుంచి తీసేశారని విమర్శించారు. ఈ మేరకు మాజీ మంత్రి హరీశ్‌రావుకి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. గురువారం సచివాలయంలో మీడియాతో మంత్రి ఉత్తమ్ చిట్‌చాట్ చేశారు.మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో వచ్చే వేసవి వరకు రిపేర్లు పూర్తి అవుతాయని తెలిపారు. బ్యారేజీలో డ్యామేజీల మరమ్మతులు చేయడానికి తాము చిత్తశుద్ధితో పని చేస్తున్నామని స్పష్టం చేశారు. హరీశ్‌రావు తనకు మంత్రి పదవి ఇవ్వాలని అంటున్నారని.. కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి చెప్పినట్లుగా హరీశ్‌రావు తమ పార్టీలో చేరుతారా? అని ప్రశ్నించారు. హరీశ్‌రావు వ్యాఖ్యలపై సరైన సమయంలో సవివరంగా తాము సమాధానం చెబుతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఇకపోతే ఎల్‌నినో ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా జిల్లాల వారీగా కార్యాచరణకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. ప్రతి పరిస్థితినీ ప్రభుత్వం పర్యవేక్షిస్తోందన్నారు. గ్రామసభల ద్వారా ఎల్‌నినోపై చైతన్యం కల్పిస్తామన్నారు. శాస్త్రవేత్తల సూచనలతో పంటల ఎంపిక చేసుకోవాలని, ప్రతి రైతుకు సాంకేతిక సలహాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. రిజర్వాయర్ల నీటి లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు మంత్రి తెలిపారు. సాగునీటి వినియోగం శాస్త్రీయంగా నిర్వహిస్తామన్నారు. ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ప్రతి జిల్లాలో నిరంతరం సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

వదంతులను నమ్మొద్దని.. అధికారుల సూచనలు పాటించాలని రైతులకు సూచించారు. ఎల్‌నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యం అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వర్చువల్‌గా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు.

## 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్స్ ఆర్థిక వ్యవస్థ

మొదటిపేజీ తరువాయి

గతంలోనూ రంగారెడ్డి జిల్లా ప్రజల త్యాగాల వల్లే ఓఆర్ఆర్, పరిశ్రమలు వచ్చాయన్నారు. అత్యంత నివాస అనుకూల నగరాల జాబితాలో హైదరాబాద్ ముందుంటుంది. అయినప్పటికీ హైదరాబాద్‌ను కూడా కాలుష్య సమస్య వేధిస్తోంది. 1.34 కోట్ల మంది ఓఆర్ఆర్ లోపల నివసిస్తున్నారు. ఓఆర్ఆర్ లోపలున్న పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలించాలని నిర్ణయించాం. పెరి అర్బన్ రీజియన్‌లో ప్రత్యేక మాన్యుఫ్యాక్చరింగ్ జోన్లు ఏర్పాటుచేస్తున్నామని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాజకీయంగా ఎన్ని ఆరోపణలు వచ్చినా తమ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధినే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందని సీఎం అన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయాలు ఉంటాయని, ప్రస్తుతం రాష్ట్ర అభివృద్ధికి అందరూ సహకరించాలని ప్రతిపక్షాలను కోరారు. అధికారం కోల్పోయిన బాధ ఉన్నా అభివృద్ధిని అడ్డుకోవద్దని, తమ ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్న సీఎం.. అలాంటి పరిస్థితులు హైదరాబాద్‌లో రాకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేస్తున్నామని చెప్పారు. అందుకే ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న సుమారు 2,100 చ.కి.మీ. ప్రాంతాన్ని ఏరియాగా అభివృద్ధి చేయాలని నిర్ణయించామని తెలిపారు. అలాగే రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్ ప్రాంతాలుగా విభజించి సమతుల అభివృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని వెల్లడించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ 10శాతం వాటా సాధించేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రజల సహకారంతో 2034 నాటికి రాష్ట్రాన్ని1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షించాలంటే మెరుగైన మౌలిక సదుపాయాలు అవసరమని సీఎం అభిప్రాయ పడ్డారు. యువతకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు అందించేందుకు అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లు, స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీతారాంపూర్‌లో సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్ ప్రారంభం కావడం సంతోషకరమని పేర్కొన్న సీఎం.. ఈ ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన కుటుంబాలకు ఇంటి పట్టాలు ఇవ్వడంతో పాటు ఉపాధి కోసం వ్యాపార సముదాయాలు నిర్మించి అందించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా రైతులు చేసిన త్యాగాల వల్లే ఈ అభివృద్ధి సాధ్యమైందని సీఎం కొనియాడారు. చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే బుద్వేల్ నుంచి కొడంగల్ వరకు 100 మీటర్ల వెడల్పుతో రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. సీతారాంపూర్‌లో నిర్మిస్తున్న ఆలయ ప్రారంభోత్సవానికి త్వరలో మరోసారి వస్తానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

ప్రజల సహకారంతో తెలంగాణను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్తామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నాం

మొదటిపేజీ తరువాయి

ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాధపురంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న మెగా రైతు మేళాను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ల చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, జిల్లా కలెక్టర్ దివాకరతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ సాంకేతికతపై అవగాహన కల్పించడమే ఈ మెగా రైతు మేళా ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు.

మెగా రైతు మేళా ప్రాంగణంలోనే శుక్రవారం మధ్యాహ్నం రైతు ఆశీర్వాద సభ నిర్వహించనున్నారు. ఈ సభకు సీఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ కార్యక్రమాలు, వ్యవసాయ అభివృద్ధి చర్యలపై సీఎం రైతులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వంపై భట్టి విక్రమార్క విమర్శలు గుప్పించారు. దశాబ్దాల క్రితం నిర్మించిన నాగార్జునసాగర్, ఎస్ఆర్ఎస్పీ, కడెం వంటి ప్రాజెక్టులు ఇప్పటికీ బలంగా ఉన్నాయని, బీఆర్ఎస్ నిర్మించిన ప్రాజెక్టుల పరిస్థితి రాష్ట్ర ప్రజలకు తెలిసిందేనని వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లాకు గత ప్రభుత్వాలు తగిన నీటి వనరులు అందించలేదని, ఆ విషయాన్ని చరిత్రతో సహా నిరూపిస్తామని అన్నారు. బీఆర్ఎస్ ప్రజలను మాటలతో మోసం చేసే పార్టీ అని, 2023 అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ పార్టీ నేతలు జిల్లాల పర్యటనలు చేస్తూ విమర్శలు

చేస్తున్నప్పటికీ ప్రజలు నమ్మే పరిస్థితి లేదని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదవుతోందని, రైతులు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. తక్కువ కాలంలో దిగుబడి వచ్చే పంటలు, ఆరుతడి పంటలు, పప్పుధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించాలని కోరారు. నాగార్జునసాగర్‌లో నీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో సీతారామ ప్రాజెక్టు, రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా వైరా ప్రాజెక్టుకు నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. ఆ నీరు ఇవాళ లేదా రేపటిలోగా వైరా రిజర్వాయర్‌కు చేరుతుందని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. మధిర నియోజకవర్గంలోని మొక్కజొన్న రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరడంతో రాష్ట్రవ్యాప్తంగా మొక్కజొన్న కొనుగోలు చేపట్టినట్లు తెలిపారు. ప్రకృతి, కేంద్ర ప్రభుత్వ సహకారం పూర్తిస్థాయిలో లేకపోయినా రైతుల కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. కేంద్రం నుంచి అవసరమైన ఎరువులు సాధించామని, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు టెక్నాలజీ వినియోగిస్తూ యాప్ ద్వారా యూరియా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అలాగే వర్షాల సమాచారాన్ని

కూడా సాంకేతికత ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు అందిస్తున్నామని వెల్లడించారు. సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం పనిచేయడం లేదని విమర్శించే వారికి లెక్కలతో సహా సమాధానం చెబుతామని అన్నారు. రైతు భరోసా పథకం కింద కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసిన ప్రభుత్వం కాంగ్రెస్ మాత్రమేనని పేర్కొన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ కోసం ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తోందని, రైతుల ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకుంటోందన్నారు.

## 22ఏ సంకెళ్లు తెంచిన ప్రజాప్రభుత్వం: చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి

**బనగానపల్లె, జూలై 09 :**

నంద్యాల జిల్లా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వేలాది ఎకరాల భూములను 22ఏ నిషేధిత జాబితా నుండి విముక్తి కల్పించి రైతులకు ఊరట కలిగించారు. బనగానపల్లెలో జరిగిన 'మీ భూమి మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, అక్కడిక్కడే తహసీల్దార్ కార్యాలయంలో ప్రక్రియ పూర్తి చేయించి రైతులకు ఉత్తర్వులు అందజేసి మాట్లాడారు.

**అక్కడిక్కడే ఆన్‌లైన్ ప్రక్రియ**

మూడు నెలల క్రితం డోన్ పర్యటనలో బేతంచర్ల మండలం గుటుపల్లి రైతులు తమ భూములను 22ఏ జాబితాలో చేర్చారని ఇచ్చిన అర్జీపై ముఖ్యమంత్రి తక్షణమే స్పందించారు. బనగానపల్లె తహసీల్దార్ కార్యాలయానికి అధికారులను పిలిపించి, జిల్లా కలెక్టర్ ద్వారా ఉత్తర్వులు ఇప్పించి, జిల్లా రిజిస్ట్రార్‌తో ఆన్‌లైన్ తొలగింపు ప్రక్రియను అక్కడిక్కడే పూర్తి చేయించామని తెలిపారు.

**వేలాది ఎకరాలకు విముక్తి**

ఈ నిర్ణయంతో గుటుపల్లి గ్రామానికి చెందిన 897 మంది రైతులకు చెందిన 2,074 ఎకరాల భూములకు 22ఏ నుండి విముక్తి లభించిందని చంద్రబాబు పేర్కొన్నారు. దీంతో పాటు బనగానపల్లెకు చెందిన 23 మంది రైతులకు సంబంధించిన 101 ఎకరాల చుక్కల భూములను కూడా నిషేధిత జాబితా నుండి తప్పించామని వివరించారు. భూ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని స్పష్టం చేశారు.

**రెవెన్యూ ప్రక్షాళన**

గత 2019-24 ప్రభుత్వ తప్పిదాల వల్ల భూములు తమ పేరుపై ఉన్నా రైతులు అమ్ముకోలేక, రుణాలు పొందలేక ఇబ్బందులు పడ్డారని ముఖ్యమంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెవెన్యూ ప్రక్షాళన చేపట్టిందని, తిరుమల తిరుపతి దేవస్థానం ప్రాంతాలైన శెట్టిపల్లి, వట్టిచెరుకూరు, కంగుంది తరహాలోనే దశాబ్దాలుగా ఉన్న పెండింగ్ భూ సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు.

## వైసీపీ ఒక మూతపడే దుకాణం: పీతల సుజాత

మొదటిపేజీ తరువాయి

**మంగళగిరి, జూలై 09 :**

వైసీపీ మూసేసే దుకాణంలా మారిపోయిందని టీడీపీ జాతీయ ఉపాధ్యక్షురాలు పీతల సుజాత విమర్శించారు. మంగళగిరి ఎన్టీఆర్ భవన్‌లో ఆమె మాట్లాడుతూ, జగన్ మోహన్ రెడ్డి మెప్పు కోసం ఆ పార్టీ నేతలు రోజుకో అబద్ధం చెప్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. ఎన్ని కుట్రలు చేసినా వైసీపీ మళ్లీ తెరుచుకోదని తెలిపారు.

**చట్టాల అవహేళన**

దేశ భద్రతా చట్టమైన ఉపాను కొడాలి నాని ఇడ్లీ, ఉప్మాతో పోల్చడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. చట్టాలను అవహేళన చేస్తున్న వైసీపీ నేతల మెడకు రేపు అవే గుదిబండలుగా మారబోతున్నాయని హెచ్చరించారు.

**కూటమి పాలన సంక్షేమం**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ అంకితభావంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. వైసీపీ నేతలు మాత్రం ఇంకా కులాల మధ్య చిచ్చు పెట్టే నీచ రాజకీయాలకే పరిమితమయ్యారని విమర్శించారు.

**దళితులపై అరాచకాలు**

గత వైసీపీ హయాంలో దళితులు, మహిళలపై తీవ్ర అరాచకాలు జరిగాయని పీతల సుజాత ఆరోపించారు. సోషల్ మీడియా వేదికగా అశాంతి సృష్టించాలని చూస్తే ఉపా వంటి కఠిన చట్టాలను ప్రయోగించడానికి కూటమి ప్రభుత్వం వెనకాడదని స్పష్టం చేశారు.

## కళాకారుల ఆరోగ్యం, సంక్షేమం కూడా ముఖ్యమే

మొదటిపేజీ తరువాయి

వారి అసాధారణ నైపుణ్యం, అపారమైన ఓర్పు, వృత్తిపట్ల ఉన్న అంకితభావం ఎంతో ఆకట్టుకున్నాయన్నారు. ఏళ్ల తరబడి కష్టపడి పనిచేస్తున్న కళాకారులు వెన్ను, మెడ, కీళ్ల నొప్పులు, కంటి సమస్యలు, శ్వాస సంబంధిత ఇబ్బందులు వంటి అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను తమ చేతుల మీద మోస్తున్న కళాకారుల ఆరోగ్యాన్ని కాపాడటం కూటమి ప్రభుత్వ బాధ్యత అని బలంగా విశ్వసిస్తున్నట్లు చెప్పారు.కళాకారుల సమస్యలను తెలుసుకున్న వెంటనే సంబంధిత అధికారులను ఆదేశించి రాష్ట్రంలోని వివిధ హస్తకళా, చేనేత కళాకారుల క్లస్టర్లలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని డిప్యూటీ సీఎం వెల్లడించారు. తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి కలంకారీ కళాకారులు, పశ్చిమ గోదావరి జిల్లాలోని సీతారాంపురం క్రోషే లేస్ కళాకారుల కోసం నిన్న(జులై 8న) వైద్య శిబిరాలు విజయవంతంగా నిర్వహించినట్లు పవన్ చెప్పారు. ఈరోజు(గురువారం)జులై 9న ఎన్టీఆర్ జిల్లాలోని కొండపల్లి బొమ్మల కళాకారులు, కాకినాడ జిల్లాలోని ఉప్పాడ చేనేత కార్మికులు, కడప జిల్లాలోని మాధవరం చేనేత కార్మికులు, అనంతపురం జిల్లాలోని యాడికి చేనేత కార్మికుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ÷ులై 10న విజయనగరం జిల్లాలోని బొబ్బిలి వీణ కళాకారులు, అనకాపల్లి జిల్లాలోని ఎటికొప్పాక కళాకారులు, ఏలూరు జిల్లాలోని హ్యాండ్ నాటెడ్ వూలెన్ పైల్ కార్పెట్ కళాకారులు, మదనపల్లె చేనేత కార్మికుల కోసం వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అలాగే, జులై 11న సత్యసాయి జిల్లాలోని ధర్మవరం చేనేత కార్మికులు, శ్రీకాకుళం జిల్లాలోని బుడితి ఇత్తడి కళాకారులు, కృష్ణా జిల్లాలోని పెడన బ్లాక్ కలంకారీ కళాకారులు, తిరుపతి జిల్లాలోని చెక్క శిల్ప కళాకారుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఏపీలోని మరిన్ని హస్తకళా, చేనేత కళాకారుల క్లస్టర్లలో ఇదే తరహాలో వైద్య శిబిరాలను దశలవారీగా కొనసాగిస్తామని పవన్ చెప్పారు. ఈ శిబిరాల ద్వారా సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు అవసరమైన చోట నిపుణుల వైద్య సేవలు, నిర్ధారణ పరీక్షలు, తదుపరి చికిత్సకు అవసరమైన మార్గదర్శకత్వం అందించనున్నట్లు తెలిపారు. ప్రతి హస్తకళాకారుడు, ప్రతి చేనేత కార్మికుడు ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 'కళను గౌరవించడం అంటే కళాకారుడి శ్రమను గౌరవించడం. కళాకారుడి శ్రమను గౌరవించడం అంటే ఆయన ఆరోగ్యాన్ని కాపాడటం. కళాకారులు ఆరోగ్యంగా ఉంటేనే మన సంప్రదాయాలు, వారసత్వం భావితరాలకు సజీవంగా నిలుస్తాయి. కళను కాపాడాలంటే.. ముందు కళాకారుడిని కాపాడాలి' అని ఎక్స్‌లో పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## సింగరేణిలో మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలి

మొదటిపేజీ తరువాయి

భద్రాద్రికొత్తగూడెం,జూలై9: తెలంగాణ రాష్ట్ర సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం ఏరియాలోని పీవీకే5 భూగర్భగనిని సందర్శించారు. గని ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. 'సింగరేణిలో మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ నెల 20 నుంచి గోదావరిఖనిలో నిరాహార దీక్ష చేపడతాం. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సింగరేణికి రావాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలి. కార్మికుల పట్ల చిత్తశుద్ధి ఉంటే కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రాష్ట్ర శాసన సభలో నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా తీర్మానం చేయించాలి. కార్మికులకు హెచ్ఎంఎస్ ఎప్పుడూ అండగా ఉంటుంది. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాల్సి ఉండగా.. నామమాత్రపు జీతాలు ఇస్తున్నారని కవిత మండిపడ్డారు.

# పిల్లలకు పనులు నేర్పించడం ఎందుకు ముఖ్యం

మే కార్తీ దినపత్రిక సిద్ధిపేట జిల్లా బ్యూరో జులై 10

**చదువు ఒక్కటే ముఖ్యం కాదు, ఇంట్లో చిన్న చిన్న పనులు నేర్చుకోవడం కూడా చాలా అవసరం" అని నొక్కి చెప్పారు.**

**దీనివల్ల కలిగే ప్రయోజనాలు**

**- జీవిత నైపుణ్యాలు**

కేవలం చదువు మాత్రమే పిల్లల భవిష్యత్తును నిర్ణయించదు. ఇంట్లో వంట చేయడం, కూరగాయలు కోయడం, లేదా పాత్రలు కడగడం వంటి ప్రాథమిక పనులు పిల్లలకు జీవితం పట్ల అవగాహనను కలిగిస్తాయి.

**- క్రమశిక్షణ :**

ఒక కూరగాయను కోసి, వండి, అది భోజనం గిన్నెలోకి రావడానికి వెనుక ఎంత పెద్ద ప్రక్రియ ఉందో పిల్లలకు అర్థమవుతుంది. ఇది వారికి సహనాన్ని, పని పట్ల గౌరవాన్ని నేర్పిస్తుంది.

**- లక్ష్య సాధన**

ఒక పెద్ద లక్ష్యాన్ని సాధించాలంటే, దాన్ని చిన్న చిన్న అడుగులుగా విభజించుకోవాలి.ఇంటి పనులు పిల్లలకు ఈ "చిన్న అడుగుల" విలువను నేర్పిస్తాయి. చిన్న పనులు పూర్తి చేయడంలో వచ్చే సంతృప్తి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచి, పెద్ద లక్ష్యాలను చేరుకునేలా ప్రేరేపిస్తుంది.

**- సంబంధాల బంధం**

చాలా మంది తల్లిదండ్రులు "నువ్వు చదువుకో చాలు, ఏ పనీ చేయొద్దు" అని చెబుతుంటారు. కానీ, ఇలాంటి ధోరణి వల్ల పిల్లలు రేపు పెద్దయ్యాక ఇతర బాధ్యతలను మోయలేక, రిలేషన్షిప్ సమస్యలను ఎదుర్కొని విడిపోయే అవకాశం ఉందని ఆమె హెచ్చరించారు.పనిలో పాలుపంచుకోవడం వల్ల ఒకరికొకరు సహాయం చేసుకోవడం మరియు బాధ్యతాయుతంగా ఉండటం అలవడుతుంది.

**- సబ్‌కాన్షియస్ మైండ్**

మనం మాటల ద్వారా నేర్పించే దానికంటే, పనుల ద్వారా నేర్చుకునే విషయాలు పిల్లల సబ్‌కాన్షియస్ మైండ్ (అంతర్లీన మనస్సు)లో బలంగా ముద్రించబడతాయి.పని చేయడం వల్ల వచ్చే క్రమశిక్షణ, ఓర్పు మరియు సృజనాత్మకత వారి వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుతాయి.పిల్లలకు చిన్నప్పటి నుండే బాధ్యతలు నేర్పించడం వారి భవిష్యత్తుకు పునాది వంటిది. నవీన్ నడిమింటి వైద్య నిలయం వారు కూడా పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యం మరియు వ్యక్తిత్వ వికాసం గురించి కొన్ని ముఖ్యమైన సూచనలు అందిస్తుంటారు.

**- శారీరక శ్రమ - ఆరోగ్యానికి మూలం:**

నేటి కాలంలో పిల్లలు ఎక్కువగా ఫోన్లు, కంప్యూటర్లకే పరిమితం అవుతున్నారు. ఇంట్లో చిన్న చిన్న పనులు (ఉదాహరణకు: మొక్కలకు నీళ్లు పోయడం, ఇల్లు సర్దడం) చేయడం వల్ల..

**- శారీరక ధృడత్వం :**

పిల్లల్లో రక్త ప్రసరణ మెరుగుపడుతుంది మరియు ఊబకాయం వంటి సమస్యలు రావు.

**- కండరాల సమన్వయం :**

చిన్న పనులు చేయడం వల్ల వారి చేతులు, కళ్ళ మధ్య సమన్వయం పెరుగుతుంది.

**- ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు:**

వంట గదిలో తల్లిదండ్రులకు సహాయం చేయడం వల్ల..ఆహారం ఎలా తయారవుతుందో



తెలుస్తుంది. దీనివల్ల వారు జంక్ ఫుడ్ కంటే ఇంట్లో వండే పౌష్టికాహారం పట్ల ఆసక్తి చూపిస్తారు.ఆహారం వృధా చేయకూడదనే స్పృహ కలుగుతుంది.

**- వయస్సుకు తగిన పనులు :**

పిల్లల వయస్సును బట్టి వారికి పనులు అప్పగించాలి. మరీ కష్టమైనవి కాకుండా వారు చేయగలిగేవి ఇవ్వాలి.

**- ప్రోత్సాహం:**

వారు చిన్న పని చేసినా మెచ్చుకోవాలి. దీనివల్ల వారు మరిన్ని బాధ్యతలు తీసుకోవడానికి ఉత్సాహం చూపిస్తారు.

**- ఆదర్శంగా ఉండండి :**

తల్లిదండ్రులు కూడా పనులు చేస్తూ ఉంటే, పిల్లలు మిమ్మల్ని చూసి సులభంగా నేర్చుకుంటారు. పిల్లలను ఒక క్రమ పద్ధతిలో పెంచడం వల్ల వారు భవిష్యత్తులో ఎటువంటి ఒత్తిడినైనా తట్టుకోగల మానసిక స్థైర్యాన్ని పొందుతారు.

## గౌరారం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన సిద్దిపేట అదనపు డి.సి.పి కుశాల్కర్

మేకార్తి దినపత్రిక జులై 10 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.



ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, విధుల నిర్వహణ, సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో సమావేశమై, విధుల నిర్వహణలో క్రమశిక్షణ పాటించడం, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం, కేసుల దర్యాప్తులో నాణ్యతను మరింత మెరుగుపరచడం, అలాగే సిసిటీఎన్ఎస్ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించడం వంటి అంశాలపై పలు సూచనలు చేశారు.దొంగతనాలు మరియు ఇతర నేరాల నివారణకు రాత్రి గస్తీని మరింత పటిష్టం చేయాలని, అనుమానాస్పద వ్యక్తులు మరియు వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రజల సహకారంతో నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని అదనపు డీసీపీ కుశాల్కర్ సూచించారు.అలాగే, గౌరారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌరారం హైవేపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి, అవి నిరంతరం పనిచేసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ రూరల్ సి.ఐ డి. రవిరాజు మరియు గౌరారం ఎస్.ఐ జె. ఆరోగ్యం మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన ప్రముఖులు



మేకార్తి దినపత్రిక జులై 10 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

కొమురవెల్లి మండలం రసులాబాద్ గ్రామానికి చెందిన చిందు యక్షగాన కళాకారుడు గడ్డం రఘుపతి అనారోగ్యంతో మృతి చెందగా మృతుని కుటుంబం నిరుపేద కావడంతో ఉండడానికి ఇల్లు లేక స్థలం లేక చాలా దీన అవస్థలో కుటుంబం ఉండగా మానవత దృక్పథంతో అంత్యక్రియలకు రసూలాబాద్ గ్రామ సర్పంచ్ పచ్చిమడ్ల స్వామి అనూష గౌడ్ 5000 రూపాయలు, తపస్ పల్లి సర్పంచ్,పుట్ట కనకరాజు 5000 రూపాయలు, అయినాపూర్ సర్పంచ్ ఏర్పుల కళ్యాణి కృష్ణ 2000 రూపాయలు, అయినాపూర్ మాజీ సర్పంచ్ మెరుగు శ్రీనివాస్ గౌడ్ 3000 రూపాయలు రసులాబాద్ ఉపసర్పంచ్ ఎర్రోళ్ల సుదర్శన్ 2000 రూపాయలు ఐనాపూర్ గ్రామ కార్యదర్శి రాజు 1000 రూపాయలు ఆర్థిక సాయం అందించి ఆ కుటుంబానికి కొండంత ధైర్యం అందించి అంతక్రియలు ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ఆర్థిక సాయం అందజేసిన వారికి తెలంగాణ సాంస్కృతిక సారథి పిన్నింటి రత్నం, నిరుద్యోగ కళాకారుల రాష్ట్ర కార్యదర్శి పిన్నింటి దాసు, కవి గాయకులు పిల్లుట్ల శ్యాంసుందర్, సాయిలు,పరశురాములు, కృతజ్ఞతలు తెలియజేశారు,

# విద్యాసంస్థల బంద్ విజయవంతం

**- పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి**

**- 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకే పరిమితం చేసే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి**

**- మల్లారపు ప్రశాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి**

మేకార్తి దినపత్రిక, జూలై 10 రాజన్న సిరిసిల్ల జిల్లా

ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ విజయవంతం అయిందని తెలిపారు ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ మాట్లాడుతూ, ప్రభుత్వం జూన్ 12 నాటికి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ తదితర సౌకర్యాలను అందజేస్తామని ప్రకటించినప్పటికీ, పాఠశాలలు ప్రారంభమై 20 రోజులు గడిచినా ఇప్పటికీ విద్యార్థులకు యూనిఫాంలు పూర్తిస్థాయిలో అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పాఠ్యపుస్తకాలలో కూడా కొన్ని టైటిల్స్ అందుబాటులో లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.మధ్యాహ్న భోజన పథకం అమలులో కూడా అనేక సమస్యలు కొనసాగుతున్నాయని, పెరిగిన ధరలకు అనుగుణంగా నిధులు పెంచకపోవడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం కష్టంగా మారిందన్నారు. కాబట్టి మధ్యాహ్న భోజన పథకానికి తగిన నిధులు కేటాయించి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చాయని, పుస్తకాలు, నోట్‌బుక్స్, బెల్టులు, టైలు, షూలు, సాక్సులు తదితర వస్తువులను విద్యార్థులపై బలవంతంగా కొనుగోలు చేయిస్తున్నాయని విమర్శించారు. పాఠశాలలకు ఆకర్షణీయమైన పేర్లు జోడించి ప్రచారం చేస్తూ, నర్సరీ స్థాయి నుంచే లక్షలాది రూపాయల ఫీజులను వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించే ప్రత్యేక చట్టాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా రాష్ట్రంలోని సుమారు 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేల పాఠశాలలుగా కుదించే ప్రతిపాదన ప్రభుత్వ విద్యా వ్యవస్థకు తీవ్ర నష్టం కలిగించే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి పాఠశాలల సంఖ్యను తగ్గించకుండా, జనాభా ప్రాతిపదికన కొత్త




ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేసి, ఇప్పటికే ఉన్న పాఠశాలలను మరింత బలోపేతం చేయాలని కోరారు.జిల్లాలో అద్దె భవనాల్లో నడుస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలు మరియు సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటికి సొంత భవనాలు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు.అలాగే పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడం వల్ల ముఖ్యంగా ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కాబట్టి పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్‌లు మరియు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ముబారక్, మహేష్, నిఖిల్, అన్వేష్, రాహుల్, సాయి, శివ, వెన్నెల, అఖిల, స్నేహిత మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏడో వార్డులో డ్రైడే -ఫ్రైడే కార్యక్రమం.

కౌన్సిలర్ పోతిగంటి ప్రసాద్ గౌడ్.



మేకార్తి దినపత్రిక జులై 10 సిద్దిపేట బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

చేర్యాల పట్టణం 7వ వార్డులో మైసమ్మ దేవి, శుభోదయ స్కూల్ రోడ్డు లో"డ్రై డే -ఫ్రై డే" కార్యక్రమంలో కౌన్సిలర్ పోతుగంటి ప్రసాద్ గౌడ్ పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునివ్వడం జరిగింది సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని,ఇంటి పరిసరాలలో నీరు నిలవకుండా పాత టైర్లు కొబ్బరి బోండాలు పాత కూలర్లు నీరు నిలవకుండా చూసుకోవాలని,దోమలు పెరగకుండా ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రం చేసుకోవాలని కోరడం జరిగినది.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ బుర్ర అన్నపూర్ణ అంగన్వాడి టీచర్ ఆశ వర్కర్ ఆర్పీలు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# 85 లక్షల మంది ఆర్ఎంపీ-పీఎంపీ గ్రామీణ వైద్యుల ఆశాకిరణం డా. ఎస్.కె. శర్మ గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు.

మేకార్తి దినపత్రిక.10.సిద్దిపేట జిల్లా ఇంచార్జ్ పాపని స్వామి.

దేశంలోని గ్రామీణ ప్రజలకు నిరంతరం ఆరోగ్య సేవలు అందిస్తూ, ఎన్నో కుటుంబాలకు జీవనాధారంగా నిలిచిన 85 లక్షల మంది ఆర్ఎంపీ-పీఎంపీ గ్రామీణ వైద్యుల సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతూ, వారి హక్కుల సాధనకు తన గొంతును వినిపిస్తూ, భారత ప్రభుత్వాన్ని ఆర్ఎంపీ కమిషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారికి వినతిపత్రం సమర్పించిన పీసీఎంఏ ఆల్ ఇండియా జాతీయ అధ్యక్షులు డా. ఎస్.కె. శర్మ గారికి మా హృదయపూర్వక



అభినందనలు మరియు కృతజ్ఞతలు.

గ్రామీణ వైద్యులను కేవలం వైద్యులుగానే కాకుండా, లక్షలాది కుటుంబాల జీవనోపాధికి ఆధారంగా భావించి, వారి భవిష్యత్తు కోసం నిరంతరం కృషి చేస్తున్న మీ సేవాభావం నిజంగా ఆదర్శనీయం.ఆర్ఎంపీ--పీఎంపీ వైద్యులకు చట్టబద్ధ గుర్తింపు, శిక్షణ, ధ్రువీకరణ మరియు గౌరవప్రదమైన స్థానం కల్పించాలనే మీ సంకల్పం త్వరలోనే ఫలించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము.మీ నాయకత్వం మాకు ధైర్యం... మీ పోరాటం మాకు ఆశ... మీ సేవలు మాకు స్ఫూర్తి. ఆర్ఎంపీ--పీఎంపీ వైద్యులందరి హృదయాల్లో మీరు ఎల్లప్పుడూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. మీ సేవలకు శిరసావహించి మా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము.

## ముస్తాబాద్‌లో బిఆర్ఎస్ పార్టీ బి ఎల్ ఏ ల సమావేశం





మేకార్తి దినపత్రిక, జూలై/10 ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో మండల శాఖ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ బి ఎల్ ఎ ల సమావేశం నిర్వహించారు. ఎన్నికల సంఘం చేపడుతున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియ నేపథ్యంలో పార్టీ బి ఎల్ ఏ లు అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ పార్టీకి ఎలాంటి నష్టం జరగకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని నాయకులు సూచించారు. ఈ సందర్భంగా నాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు మాట్లాడుతూ, ప్రతి బూత్‌లో పార్టీ కార్యకర్తలు, బి ఎల్ ఏ లు సమన్వయంతో పనిచేసి అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రక్రియలో పార్టీ శ్రేణులు చురుకుగా పాల్గొని ఓటరు జాబితా పరిశీలనలో కీలక పాత్ర పోషించాలని అన్నారు. ఈ సమావేశంలో నాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు , రాజన్న సిరిసిల్ల జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తోట ఆగయ్య , మాజీ రైతు బంధు అధ్యక్షులు కల్వకుంట్ల గోపాల్ రావు ,ముస్తాబాద్ మండల బిఆర్ఎస్ అధ్యక్షులు భోంపెల్లి సురేందర్ రావు, కొమ్ము బాలయ్య,సర్వర్ పాషా,ఏద్దండి నర్సింహా రెడ్డి ముస్తాబాద్ మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు, అన్ని గ్రామాల బి ఎల్ ఏ లు, ప్రజాప్రతినిధులు బిఆర్ఎస్ , పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి : అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



మేకార్తి దినపత్రిక, జూలై 10 ,వేములవాడ

వేములవాడ మండలం అనుపురం సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. శుక్రవారం ఉదయం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, వేములవాడ లోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను అదనపు కలెక్టర్ పరామర్శించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితులను, వారికి అందిస్తున్న చికిత్స గురించి అదనపు కలెక్టర్ సంబంధిత వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యంతో పాటు మందులు, భోజనం క్రమం తప్పకుండా అందించాలని, వారి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. బాధితులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్యులు, సిబ్బందిని అదనపు కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిలా వైద్యాధికారి ఏంజెలినా అల్ఫ్రెడ్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పర్యవేక్షకులు ప్రవీణ్, తహసీల్దార్ జయంత్, వైద్యులు, తదితరులు ఉన్నారు.

# గ్రామ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేయాలి

- ఆర్థిక సంఘం నిధులు, వీబీజీ రాంజీని సద్వినియోగం చేసుకోవాలి
- తాగునీటి సరఫరా, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి
- ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్ పక్కాగా వసూలు చేయాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు సిరిసిల్లలో శిక్షణ





మేకార్తి దినపత్రిక,జూలై -10 రాజన్న సిరిసిల్ల జిల్లా

జిల్లాలోని ప్రతి గ్రామ సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని, దానికి అనుగుణంగా ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై ఇల్లంతకుంట, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, తంగళ్లపల్లి, వీర్నపల్లి, ముస్తాబాద్ మండలాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. నాలుగు రకాల చెత్త బుట్టలు ప్రదర్శనలో పెట్టారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ..జిల్లాలోని ప్రతి గ్రామపంచాయతీ గ్రామ జనాభా, అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికను రూపొందించుకోవాలని ఆదేశించారు. పాఠశాలలో కనీస వసతుల కల్పన, గ్రామంలో మురుగునీటి కాలువలు, ఇతర మౌలిక వసతులు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు నిబంధనల ప్రకారం వినియోగించాలని తెలిపారు. వీబీజీ రాంజీ కింద వివిధ పనులు చేసుకునే అవకాశం ఉందని, గ్రామీణ అభివృద్ధి శాఖ, ఎస్సీ కార్పొరేషన్ ఇతర ప్రభుత్వ శాఖలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల కింద గ్రామాభివృద్ధికి సంబంధించిన పథకాల వివరాలు తెలుసుకొని దానికి అనుగుణంగా తమ గ్రామంలో పనులు చేసుకోవాలని తెలిపారు. వీబీ జీ రాంజీ కింద ప్రతి వర్షం నీటి బొట్టు భూమిలోకి వెళ్లేలా ఇంకుడు గుంతలు, నీటి వనరుల సంరక్షణ, మొక్కల పెంపకం, ఇతర పనులు చేసుకోవచ్చని తెలిపారు. శ్రీ నిధి కింద స్వయం ఉపాధి పథకాలు అమలు చేసే అవకాశం ఉందని వివరించారు. గ్రామంలోని నీటి ట్యాంకును శుభ్రం చేయించాలని, మురుకు కాలువలు నిత్యం శుభ్రం చేయించాలని, నీటి సరఫరాను చేయించాలని, ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి సెగ్రిగేషన్ షెడ్ కు తరలించాలని ఆదేశించారు. వాటిని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని స్పష్టం చేశారు టైఫాయిడ్, డెంగ్యూ నియంత్రణ సాధ్యమని వెల్లడించారు.సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామంలోని ఆయా ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని ప్రతి ఇంట్లో మంగళవారం, శుక్రవారం డ్రైడే పాటించేలా చూడాలని గ్రామ స్థాయి అధికారులు సంయుక్తంగా పరిశీలించాలని నిల్వ నీటిని పారబోయాలని సూచించారు. వర్షం కురిసిన మరుసటి రోజు సైతం నీరు నిలువ ఉన్న చోట బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని ఆదేశించారు. ప్రతి ఇంటికి నాలుగు రకాల చెత్త బుట్టలు ఇవ్వాలని, దానికి అనుగుణంగా చెత్తను సేకరించాలని తెలిపారు. మంచినీటి లోనే డెంగ్యూ దోమలు పెరుగుతాయని తెలిపారు. సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు ఈ విషయమై ప్రత్యేక శ్రద్ధ వహించి పారిశుధ్య పనులు పక్కాగా చేయించాలని ఆదేశించారు. గ్రామంలోని ఫాగింగ్ మిషన్ తో నిత్యం అన్ని వార్డుల్లో ఫాగింగ్ చేయించాలని తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు వాడకుండా చూడాలని, నిబంధనలు అతిక్రమించే వారికి నోటీసులు జారీ చేయాలని సూచించారు. అయినా తీరు మారకపోతే జరిమానా విధించాలని ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు వివిధ గ్రాంట్లు గ్రామపంచాయతీ అభివృద్ధి, వివిధ పనులకు మంజూరు అవుతాయని వెల్లడించారు. గ్రామపంచాయతీ సైతం తమ పరిధిలోని అన్ని ఇళ్ల నుంచి ఇంటి పన్ను వసూలు చేయాలని, అన్ని వ్యాపార సముదాయాల నుంచి ట్రేడ్ లైసెన్స్ వసూలు చేయాలని స్పష్టం చేశారు. ఎల్ నినో నేపథ్యంలో వర్షపాతం తక్కువ అయ్యే అవకాశం ఉందని తెలిపారు. దీనికి అనుగుణంగా వ్యవసాయ శాఖ అధికారులు సూచన మేరకు రైతులు పంటలు సాగు చేసేలా సూచనలు చేయాలని పేర్కొన్నారు. స్వల్ప కాలిక పంటలు కూరగాయలు, పప్పు ధాన్యాలు,ఆయిల్ ఫామ్ సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. సమావేశంలో జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి జయశీల, మిషన్ భగీరథ ఈఈ అన్వర్, ఆయా మండలాల ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

# ముస్తాబాద్ లో విద్యాసంస్థలు బంద్ విజయవంతం

- 27 వేల ప్రభుత్వ పాఠశాలను 4 వేల కస్టర్ గా తగ్గిస్తే ప్రభుత్వంపై ఉద్యమం తప్పదు
- అధికారం చేపట్టే రెండున్నర సంవత్సరాలు పూర్తవుతున్న విద్యాశాఖ మంత్రి నియమించర
- విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి
- ఏఐఎస్ఎఫ్




మేకార్తి దినపత్రిక, జూలై 10 ముస్తాబాద్

ముస్తాబాద్ మండల జూలై 10: రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ముస్తాబాద్ లో విద్యాసంస్థల బంధు విజయవంతంగా అయ్యింది. ముస్తాబాద్ మండల కేంద్రంలో ప్రైవేట్, ప్రభుత్వ,పాఠశాలలు, మరియు కళాశాలలు, బందు అనంతరం ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు కుర్ర రాకేష్ మాట్లాడుతూ - రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేస్తూ విద్యార్థులను విద్యకు దూరం చేసే కుట్ర చేస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండున్నర సంవత్సరాలు అవుతున్న విద్యారంగ సమస్యలు పరిష్కరించమంటే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరు ఎట్టినట్టు వివరించడం బాధాకరమైన అన్నారు. రాష్ట్రంలో 27 వేల ప్రభుత్వ పాఠశాలను 4 వేల కస్టర్ గా చేసి పేద విద్యార్థులను విద్యకు దూరం చేసే కుట్ర ఈ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఆరోపించారు. తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా ఫీజు నియంత్ర చట్టాన్ని అమలు చేసి ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలను అరికట్టాలని వారి డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ లను 10,500వేల కోట్లకు పైగా ఉన్న వాటిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టిపిసిసి చీ ఫ్ నాటే ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మేం అధికారంలోకి వస్తే విద్యార్థులకు రావాల్సిన ఫీజు బకాయిలను వెంటనే చెల్లిస్తామని చెప్పి రెండున్నర సంవత్సరాలు కావస్తున్న ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయడంపై అంతర్యం ఏమిటనే ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయండి డిమాండ్ చేశారు. తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించి ప్రభుత్వ విద్య విద్యార్థులకు తల్లిదండ్రులకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఏఐఎస్ఎఫ్ నాయకులు నీరిటి పూర్ణచంద్ నల్ల అక్షయ్ బందల అమర్ బోదాసు శివ బన్నీ మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కేకే జన్మదిన వేడుకలు

మేకార్తి దినపత్రిక జూలై 10 గంభీరావుపేట

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా పార్టీ నాయకులు కార్యకర్తలు కేక్ కట్ చేసి మహేందర్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు అనంతరం పర్ష హనుమండ్లు మాట్లాడుతూ ఆయన ఆ భగవంతుని దయ కృపాకటాక్షాలు ఉండాలని మంచి ఆరోగ్యం కలగాలని అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పర్ష హనుమాన్లు మాజీ మండల అధ్యక్షుడు అమిద్ భాస్కర్ శ్రీనివాస్ భాస్కర్ శ్రీనివాస్ గౌడ్ లక్కం నాంపల్లి వేషాల వెంకటి వివిధ గ్రామాల నాయకులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు



# భర్తను చంపిన భార్యను అరెస్టు చేసిన కోరుట్ల పోలీసులు

మేకార్తి దినపత్రిక : జూలై - 10 కోరుట్ల టౌన్
జూలై 09న గురువారం రోజు జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణం కోరుట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మెట్ పల్లి డిఎస్పి ఏ. రాములు నిన్న రాత్రి అల్లమయగుట్ట లో హత్యకు గురైన ఇప్ప కాశిరం హత్య పూర్వపురాలు గురించి వివరించడం జరిగింది. ఇప్ప కాశిరాం, 35 సంవత్సరాలు, అతను కోరుట్ల లోని అలమయ్య గుట్టకు చెందిన రజినితో గత 14 సంవత్సరాల క్రితం వివాహమైనది వారికి ఇద్దరు పాపలు ఒక బాబు కలరు.గత కొన్ని రోజుల క్రితం భర్త తో పాటు భార్య రజిని కూడా మద్యం తాగినది అని ఇద్దరి మధ్య గొడవ జరిగింది ఆ రోజు నుండి మద్యం తగిన విషయాన్ని మనసులో పెట్టుకొని భర్త కాశీరం ప్రతిరోజు మద్యం తాగి వచ్చి భార్య రజిని కొడుతూ పిల్లల్ని ఇబ్బంది పెడుతున్నారని అతని వల్ల తనకు తన పిల్లలకు ప్రతి విషయం లో ఇబ్బందులు ఎదురు అవుతున్నాయని ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని గత 20 రోజుల క్రితం తన భార్య రజిని భర్తను చంపాలని కర్రతో దాడి చేయగా తమ ఇంటి పక్కనవున్నా వారు వచ్చి అతనిని కాపాడి ఆసుపత్రికి తరలించి కాశీరాశీ ను బ్రతికించారు.మరల నిన్న తేదీ 8- 7-2026 రోజున కాశీరాం తన కుటుంబ సభ్యులతో మధ్యాహ్నం చెట్ల పండగ వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చి మళ్ళీ రాత్రి బయటకు వెళ్లినాడు. రజిని తన భర్తను చంపాలని ఆలోచనతోటి తన పిల్లలను ముందుగానే తన తల్లి గారింటికి పంపి మద్యం సేవించి ఇంటికి వచ్చిన భర్త తో ఉద్దేశపూర్వకంగా గొడవపడి నా అందాజ రాత్రి 11 గంటల 45 నిమిషాలకు సరిఅయిన సమయం గా భావించి కాశి రామని తన ఇంటిలోని రోకలిబండతో తలపై మరియు ఇతర చోట్ల బలంగా కొట్టగా తలపై తీవ్ర రక్త గాయాల వల్ల మృతులు కాశీరాం అక్కడికక్కడే చనిపోయినాడు. అనంతరం ఇంటి నుండి పారిపోయి అయ్యప్ప స్వామి ఆలయం వెనకాల



ఉన్న బంధువుల దగ్గర పడుకొని ఈరోజు పారిపోతుండగా నమ్మదగిన సమాచారంతో సీఐ,ఎస్ఐ వారి సిబ్బంది నిందితులను పట్టుకొని అదుపులోకి తీసుకొని హత్యకు ఉపయోగించినటు వంటి రోకలి బండను స్వాధీన పరుచుకోవడం జరిగినది.ఇట్టి దర్యాప్తులో నేరం రుజువు చేయటానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అరెస్టు చేసిన సిఐ, ఎస్ఐ, లను డి.ఎస్.పి అభినందించడం జరిగింది.

# హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి.

- ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభల కరపత్రం ఆవిష్కరణ.
- ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్.




మేకార్తి దినపత్రిక కరీంనగర్ టౌన్ ,జులై 10.
రాష్ట్రంలోని అన్ని రంగాల హమాలి కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్ డిమాండ్ చేశారు .. ఈరోజు జమ్మికుంట మండలం కోరపల్లిలో కరీంనగర్ జిల్లాకోఆపరేటివ్ హమాలి కార్మిక సంఘం జిల్లా జనరల్ బాడీ సమావేశం జమ్మికుంట మండల అధ్యక్షులు వంగ ఓదేలు అధ్యక్షతన జరిగింది. సమావేశానంతరం ఏఐటియుసి రాష్ట్ర నాలుగో మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించి మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా బుచ్చన్న యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కో-ఆపరేటివ్ సొసైటీలో పనిచేస్తున్న హమాలి కార్మికులకు పని భద్రత లేకుండా పని భద్రత కోల్పోయే ప్రమాదం ఏర్పడుతుందని తక్కువ కూలికి పనిచేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. లారీలు దించేటప్పుడు అనేకమైనటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని కాబట్టి వీరికి ప్రమాద బీమా సౌకర్యం,పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించే విధంగా కార్మిక శాఖ ప్రభుత్వ చర్యలు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు.వెంటనే ప్రభుత్వం హమాలి కార్మికుల సంక్షేమం కోసం పని భద్రతతో పాటు వారికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ బోర్డు ద్వారా అనేక సంక్షేమ పథకాలు తీసుకురావాలని దీనిపైన రాష్ట్ర మహాసభలో కోఆపరేటివ్ హమాలి కార్మికుల సమస్యలపై తీర్మానం చేయడం జరుగుతుందని రానున్న రోజులలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈనెల 12వ తేదీన కరీంనగర్ నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్లో ఏఐటీయూసీ జిల్లా మహాసభ జరగనున్నాయని దీనికి కార్యకర్తలు తరలి రావాలని ఆయన కోరారు సెప్టెంబర్ లో కరీంనగర్ నగరం లో సెప్టెంబర్ 6,7, 8 తేదీలలో జరిగే రాష్ట్ర నాలుగో మహాసభల్లో జిల్లాలోని హామాలి కార్మికులు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కోరపెల్లి యువ చైతన్య తాపీ సంఘం గౌరవ అధ్యక్షులు శంకర్, అధ్యక్షులు కనకం కుమార్ ఉపాధ్యక్షులు బోయిని సమ్మయ్య, టీ నర్సింగరావు సలహాదారులు ఇల్లందుల చందు, బోయిని అంకుస్,లి పోచయ్య లతోపాటు దాదాపు 20 మంది కార్యకర్తలు ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు బుచ్చన్న యాదవ ఆధ్వర్యంలో ఏఐటీయుసీలో చేరారు ఈ సమావేశంలో కోపరేటివ్ హమాలీ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మచనపల్లి శ్రీనివాస్, యుగేందర్, గిరవేణి రాజు,తిక్క శ్రీధర్, గేల రాములు కే తిరుపతి, బండారి స్వామి బీర్ల నరేష్, పి రాజయ్య, పి. ఈరన్న, ఎల్ సుమన్,పిల్లి రాజు, పి ఐలయ్య, కిరణ్, బి.రాజు కార్మికులు పాల్గొన్నారు.

# విద్యార్థి నాయకుల పై పోలీసుల అత్యుత్సాహం సరికాదు.



- పోలీసులతో విద్యార్థి ఉద్యమాన్ని ఆపలేరు.

మేకార్తి దినపత్రిక కరీంనగర్ టౌన్ జులై 10.
రాష్ట్రవ్యాప్తంగా ఈరోజు విద్యాసంస్థల బందుకు వామపక్ష విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చితే దానిని భగ్నం చేయుటకు ప్రభుత్వం పోలీసులను ఉపయోగించి విద్యార్థి నేతలపై విచక్షణ రహితంగా దాడులకు పాల్పడడాన్ని సిపిఐ నగర సమితి తీవ్రంగా ఖండిస్తుందని సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజులు ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రతి ఏటా ఏ విధంగా నిర్వహిస్తారో అదే విధంగా గీతాబావన్ చౌరస్తా నుండి బైక్ ర్యాలీకి సన్నతమవుతున్నటువంటి వామపక్ష విద్యార్థి నాయకులపై పోలీసులు అత్యుత్సాహంతో అడ్డుకొని ర్యాలీ నిర్వహించకుండా విచక్షణ రహితంగా వారిని పై పోలీసులుదాడులకు పాల్పడడం దుర్మార్గమైన చర్య అని వారు విమర్శించారు . రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుండి విద్యార్థుల ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్ షిప్ మంజూరు చేయడంలో ఘోరంగా విఫలం చెందిందని ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టడంలో రేవంత్ రెడ్డి సర్కార్ నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందని, ప్రభుత్వ స్కూళ్లను మూసివేస్తుందని, ప్రభుత్వ టీచర్ నియామకాల ను చేయడం లేదనికాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల్లో ఉన్నటువంటి విద్యాశాఖ పై పట్టు కోల్పోయాడని విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో రేవంత్ రెడ్డి వైఫల్యం చెందాడని ఇలాంటి నిర్బంధాలు ఎన్ని పాల్పడిన రేవంత్ రెడ్డికి తగిన గుణపాఠం చెప్తారని వారు అన్నారు. విద్యార్థులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం కూడా మన గడ సాగించలేదని విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడితే సహించేది లేదని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన మాట కట్టుబడి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో సిపిఐ ఉద్యమాలు చేస్తుందని అన్నారు. వెంటనే అక్రమంగా అరెస్టు చేసిన విద్యార్థి నేతలను విడుదల చేయాలని వారిని అక్రమంగా అరెస్టు చేసి, విచక్షణ రహితంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కసిరెడ్డి సురేందర్ రెడ్డి పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు

# శివాలయం ప్రధాన పూజారికి డాక్టరేట్:

మేకార్తి దినపత్రిక :
కొత్తగూడెం సాశీస్మృతికం :: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం ప్రగతి నగర్ శివాలయం ప్రధాన అర్చకులు ప్రముఖ శాస్త్రీయ సంగీత విద్వాంసులు మద్దిరాల ముక్తేశ్వర రావు కు అమెరికన్ యునైటెడ్ యూనివర్సిటీ పూదుచ్చేరి లోని కంభన్, కలైరంగం ఆడిటరియం లో పౌశీడర్ మరియు డైరెక్టర్ కె. వెంకటేశం చేతులమీదుగా డాక్టరేట్ ను ప్రధానం చేశారు. నలుబది సంవత్సరాల అనుభవం కలిగి ఉండి



భజన బృందాలను రెండు తెలుగు రాష్ట్రాలలో తయారుచేసి ఆధ్యాత్మికత వైపు నడిపిస్తున్నారని ప్రశంసించారు. ఈయనకు సంగీతంలో 48 గంటలు హార్మోనియం ప్రదర్శన ఇచ్చినందుకు "హార్మోనియం విధ్వన్వమని" బిరుదుతో సత్కరించారు. కాకినాడలో భజన పోటీలలో అద్భుతమైన న్యాయనిర్ణేతగా వ్యవహరించినందుకు కాకినాడ కమిటీ వారు " స్వర్ణ సింహా కంకణం" బహుకరించి సత్కరించారు "సువర్ణ సింహ తలాట సన్మాన" గ్రహీతగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమెరికన్ యునైటెడ్ యూనివర్షిటీ బాధ్యులకు ముక్టేశ్వర్ రావు ధన్యవాదములు తేలిపారు. ముక్తేశ్వర్ రావు ను కొత్తగూడెం అర్చకులు, పుర ప్రముఖులు, శివ భక్తులు అభినందించారు

# భద్రాద్రి జిల్లా ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీగా రాసమల్ల రాము నియామకం.



మేకార్తి దినపత్రిక :
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీగా భద్రాచలం పట్టణానికి చెందిన రాసమల్ల రామును నియమించారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ గద్దల రమేష్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.నియామకం అనంతరం రాసమల్ల రాము మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన జిల్లా చైర్మన్ గద్దల రమేష్కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన నియామకానికి సహకరించిన మెహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు భోగాల శ్రీనివాస్ రెడ్డి, భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.
అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి, ఎస్సీ సెల్ అభివృద్ధికి కృషి చేస్తానని రాసమల్ల రాము పేర్కొన్నారు.

# తాండాలో వన్యప్రాణి మాంసం స్వాధీనం..



మేకార్తి దినపత్రిక :
కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలోని దూప్సింగ్ తాండాలో అటవీశాఖ అధికారులు గురువారం నిర్వహించిన తనిఖీల్లో వన్యప్రాణికి చెందిన మాంసం లభ్యమైన ఘటన కలకలం రేపింది.స్థానికంగా అందిన విశ్వసనీయ సమాచారం మేరకు తాండాకు చెందిన గూగ్లోత్ పరశురాం ఇంట్లో వన్యప్రాణి మాంసం నిల్వ ఉంచినట్లు తెలిసిన నేపథ్యంలో అటవీశాఖ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా ఇంట్లో అనుమానాస్పదంగా ఉన్న మాంసాన్ని గుర్తించిన అధికారులు దానిని స్వాధీనం చేసుకుని పరిశీలన కోసం పంపించారు.స్వాధీనం చేసుకున్న మాంసం ఏ వన్యప్రాణికి చెందినదనే విషయంపై అధికారులు నిర్ధారణకు చర్యలు చేపట్టినట్లు సమాచారం. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిసింది.ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# నా కెరీర్‌లోనే ఇది సవాలు: ‘మైసా’పై రష్మిక పోస్ట్



విభిన్న పాత్రల్లో నటిస్తూ.. తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి రష్మిక తాజాగా ఒక అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. ఆమె నటిస్తున్న పాన్ ఇండియా యాక్షన్ థ్రిల్లర్ ‘మైసా’ చిత్రంలో ఎంతో కష్టమైన అండర్ వాటర్ సీక్వెన్స్‌ను పూర్తి చేశారు. భారత చలనచిత్రరంగంలో ఏ హీరోయిన్ ఇప్పటి వరకూ ఇలాంటి అండర్ వాటర్ ఫైట్ సీక్వెన్స్ చేయలేదని టీమ్ తెలిపింది. దీంతో ఈ సన్నివేశం చేసిన తొలి నటిగా రష్మిక నిలిచారు. దీనిపై రష్మిక పోస్ట్ పెట్టారు. “నేను కొద్దిరోజులుగా సోషల్ మీడియాకు దూరంగా ఉన్నానని తెలుసు. కానీ ఆ సమయంలో మేమంతా ఈ సీక్వెన్స్‌లో నిమగ్నమై ఉన్నాం. నా కెరీర్‌లో నేను చేసిన వాటిలోకెల్లా ఇది అత్యంత సవాలుతో కూడినది. దీని కోసం చాలా కష్టపడ్డాం. కానీ ఈ అనుభవం నాకెంతో ఉత్సాహాన్నిచ్చింది” అని తెలిపారు. ఈ ప్రమాదకరమైన పోరాట ఘట్టాన్ని తను డూప్ లేకుండా స్వయంగా చేసినట్లు చిత్ర బృందం ప్రకటించింది. నీటి అడుగున సాగే అత్యంత క్లిష్టమైన ఈ యాక్షన్ సీక్వెన్స్‌ని ఆమె రెండు రోజుల పాటు దాదాపు 20గంటలు నీటిలో ఉండి పూర్తి చేసిందని తెలిపింది. భారతీయ చలనచిత్ర రంగంలో ఇది ఒక మైలురాయిగా నిలిచిపోతుందని, సినిమాలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఘట్టంగా ఇది నిలుస్తుందని చిత్ర బృందం భావిస్తోంది. త్వరలోనే ‘మైసా’ టీజర్ విడుదల కానుంది.

# అఖిల్‌కు ఆల్ ది బెస్ట్ చెప్పిన సమంత.. బ్లాక్‌బస్టర్ సినిమా అంటూ పోస్ట్






మూడేళ్ల విరామం తర్వాత ‘లెనిన్’తో పలకరించారు హీరో అఖిల్. ఈ నేపథ్యంలో టీమ్‌కు సమంత ఆల్ ది బెస్ట్ చెప్పారు. అఖిల్ హీరోగా మురళీకిశోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘లెనిన్’. నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా (Lenin) పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. దీంతో టీమ్‌ను ట్యాగ్ చేస్తూ సమంత పోస్ట్ పెట్టారు. “లెనిన్ చిత్రబృందానికి.. ప్రత్యేకంగా అఖిల్‌కు ఆల్ ది బెస్ట్. ఇప్పటికే బ్లాక్‌బస్టర్ అనే టాక్ వినిపిస్తోంది” అంటూ సినిమా ట్రైలర్‌ను పంచుకున్నారు. ఇటీవల సమంత నటించిన ‘మా ఇంటి బంగారం’ సినిమా హిట్ అయిన నేపథ్యంలో అఖిల్ ఓ ఇంటర్వ్యూలో దీని గురించి మాట్లాడారు. ఆ కాన్సెప్ట్ తనకెంతో నచ్చిందని.. మంచి ఇంటికి కోడలిగా వెళ్లి.. వాళ్లందరితో బంగారం అనిపించుకోవాలనే అంశంతో పాటు, పవర్‌ఫుల్ యాక్షన్ చూపించడం చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉందని తెలిపారు. ముఖ్యంగా ఒక మహిళ పాత్రతో ఆ స్థాయి యాక్షన్ సీన్స్ చేయించడం అద్భుతమని.. సమంత తన పాత్రలో చాలా బాగా నటించారని కొనియాడారు.

## అప్పటి నుంచి పుచ్చకాయ తినడం మానేశా: కాజల్

ఆహార కల్తీ ఎన్నో జబ్బులకు కారణమవుతోందని సినీ నటి కాజల్ అన్నారు. చాలా మంది యువతులు క్యాన్సర్ బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడీ అంశాన్ని ‘ది ఇండియా స్టోరీ’ సినిమాతో ఆమె తెరపైకి తీసుకురాబోతున్నారు. చెట్టన్ డీకే తెరకెక్కించిన ఈ చిత్రం జులై 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా కాజల్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. “కథ కోసం రీసర్చ్ చేయగా చాలా విషయాలు బయటపడ్డాయి. అవి చూసి షాకయ్యా. ప్రస్తుతం ప్రతి ఇంట్లో క్యాన్సర్ సాధారణమైపోయింది. ఇటీవల ఓ కేసు గురించి విని పుచ్చకాయ తినడం మానేశా” అని కాజల్ చెప్పారు



# ‘జననాయగన్’.. సెన్సార్ బోర్డు సూచించిన మార్పులివే..



‘జననాయగన్’.. సెన్సార్ బోర్డు సూచించిన మార్పులివే..

విజయ్ కథానాయకుడిగా నటించిన ‘జన నాయగన్’ ఎట్టకేలకు సెన్సార్ పనులు పూర్తి చేసుకున్న విషయం తెలిసిందే. ఏడు నెలల తర్వాత బోర్డు ఈ సినిమాకు ‘ఏ’ సర్టిఫికెట్ జారీ చేసింది. 12 మార్పులు చేయాలని సూచించింది. మూడు గంటల నిడివితో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

**సెన్సార్ సూచించిన మార్పులివే..**

- విజయ్ నేతృత్వంలోని రాజకీయ పార్టీ ‘తమిళగ వెట్రి కళగం’ (TVK) ప్రస్తావన ఉన్న డైలాగ్‌లను తొలగించాలి.
- ‘అంబేడ్కర్ చట్టం’ అనే డైలాగ్‌ను ‘TVK చట్టం’గా మార్చాలి.
- ఓ పుస్తకం కవర్‌పై అంబేడ్కర్ ఉన్న విజువల్స్‌ను సవరించాలి.
- భారత జాతీయ జెండా కింద పడుతున్నట్లు ఉన్న ఒక కీలకమైన షాట్‌ను పూర్తిగా తొలగించాలి.
- సినిమాలో ‘రంగనాథర్’, ‘ఓం’ అనే పదాలతో పాటు ‘ఆపరేషన్ మేలుహా’ వివరణలో వచ్చే ‘న్యూ ఇండియా’ అనే పదాన్ని మ్యూట్ చేయాలి.
- ఒక చిన్నారిని తగలబెడుతున్నట్లు ఉన్న విజువల్స్‌ను తొలగించి వేరే విజువల్స్ రీప్లేస్ చేయాలి
- ‘షీలా రాణి’ అనే పేరు ఎక్కడ వచ్చినా మార్చాలి.
- సద్దాం హుస్సేన్ ఉరితీతకు సంబంధించిన డైలాగ్‌ను కూడా మ్యూట్ లేదా రీప్లేస్ చేయాలి.
- వీటితో పాటు కొన్ని సన్నివేశాల్లో వచ్చే పదాలను మ్యూట్ చేయాలి.

హెచ్.వినోద్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమ కోసం విజయ్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. జులై 24న ‘జన నాయగన్’ థియేటర్‌లలో సందడి చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. విజయ్‌కు జోడీగా పూజా హెగ్డే నటించిన ఈ సినిమాలో మమితా బైజు కీలక పాత్ర పోషించారు.

# వరుణ్ తేజ్ ‘కొరియన్ కనకరాజు’ రిలీజ్ డేట్ ఫిక్స్

వరుణ్‌తేజ్ కథానాయకుడిగా రూపొందుతున్న తాజా చిత్రం ‘కొరియన్ కనకరాజు’. మేర్లపాక గాంధీ దర్శకుడు. రితికానాయక్ కథానాయిక. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకొంటోంది. తాజాగా ఓటీటీ డీల్ కూడా పూర్తవడంతో ఈ మూవీ విడుదలకు సిద్ధమైంది. ఆగస్టు 7న ‘కొరియన్ కనకరాజు’ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు చిత్ర బృందం తెలిపింది. ‘ఇండో – కొరియన్ హారర్ కామెడీ చిత్రమిది. థ్రిల్‌నీ, హాస్యాన్నీ మేళవిస్తూ మంచి స్క్రిప్ట్‌ని సిద్ధం చేశారు మేర్లపాక గాంధీ. వరుణ్ తేజ్ ఓ విభిన్నమైన పాత్రలో కనిపిస్తారు’ అని సినీ వర్గాలు తెలిపాయి.




# జోడీ కుదిరింది





రామ్ పోతినేని హీరోగా నటిస్తూ... స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్న తొలి చిత్రం ఇప్పటికే మొదలైంది. కృష్ణ పోతినేని నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోంది. కానీ, ఇందులో రామ్ సరసన నటించే నాయిక ఎవరన్నది ఇంకా ప్రకటించలేదు. గతంలో ఈ పాత్ర కోసం శ్రీనిధి, కయాదు తదితర పేర్లు వినిపించగా.. ఇప్పుడీ అవకాశం సంయుక్తా మేనన్‌కి దక్కినట్లు సమాచారం. ఇప్పటికే దీనికి సంబంధించి ఆమెతో సంప్రదింపులు పూర్తయినట్లు తెలిసింది. త్వరలోనే దీన్ని అధికారికంగా ప్రకటించే అవకాశముంది. ఓ విభిన్నమైన సైకలాజికల్ థ్రిల్లర్‌గా ముస్తాబవుతున్న ఈ సినిమాలో రామ్.. వీరా అనే సరికొత్త పాత్రలో అలరించనున్నారు. ఇది ఆయన కెరీర్‌లోనే అత్యంత సవాల్‌తో కూడిన పాత్రని చిత్ర వర్గాలు తెలిపాయి.

**PRINTED,PUBLISHED & OWNED BY MEKARTHI SRINIVAS, Printed at SUNDAY PRINTING PRESS, H.No. 3-4297, SARASWATHI COMPLEX,SVN COLONY GUNTUR,ANDHRA PRADESH-522006.& Published from H.No. 12-166, RAJIV NAGAR,MUSTABAD, RAJANNA SIRICILLA DISTRICT-505404 TELANAGNA,.**
**RNI No.TGTEL /25/A2356,Editor : MEKARTHI SRINIVAS, Cell: 9014726022.e-mail: MEKARTHI DINAPATRIKA@gmail.com**